

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 25-04-2026 | సంపుటి - 27 | సంచిక -332 | రూ : 4 | పేజీలు: 8




# బస్సులు రైట్..రైట్

2లో

- ప్రభుత్వంతో ఫలించిన ఆర్టీసీ ఐకాస చర్చలు
- 11 శాతం ఫిట్‌మెంట్‌కు నిర్ణయం
- ప్రభుత్వంలో విలీనంపై కమిటీ
- గుర్తింపు సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్
- అర్ధరాత్రి ప్రకటించిన భట్టి విక్రమార్క
- నేటి ఉదయం నుంచి రోడ్డెక్కనున్న ప్రగతి రథచక్రాలు
- శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం

## మొజ్తబా ఖమేనీకి

# ప్లాస్టిక్ సర్జరీ?

- తీవ్ర గాయాలతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ
- ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిన వైనం
- భవిష్యత్తులో ఆయన ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం
- రహస్య లేఖల ద్వారా దేశాన్ని పాలిస్తున్నారని వెల్లడించిన 'ది న్యూయార్క్ టైమ్స్'



- అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి.. కీలక నిర్ణయాలన్నీ వారే తీసుకుంటున్నారని వెల్లడి 2లో

## మే 4: టీఎంసీ గూండాల

# ఆట కట్టే రోజు..!



- బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారన్న మోదీ
- బీజేపీ ప్రభుత్వం వచ్చాక టీఎంసీ దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్ బయటకు తీస్తామన్న మోదీ
- తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అని ఆరోపణ 2లో

# ఆప్‌లో తుపాను

- ఆ పార్టీకి ఏడుగురు రాజ్యసభ ఎంపీల గుడ్ బై
- భాజపాలో విలీనమవుతామన్న రాఘవ్ చడ్డా తదితరులు
- 2/3 వంతు చీలికతో ఎగువసభ సభ్యత్వాలు సురక్షితం
- పెద్దల సభలో ఆమ్ ఆద్మీకి మిగిలింది ముగ్గురు ఎంపీలే



2లో



## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు..

# హోం శాఖ కార్యదర్శిగా శిఖా గోయల్

- తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్ వస్తారన్న ఊహాగానాలు
- ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ
- మరో ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం
- మల్కాజ్‌గిరి కొత్త పోలీస్ కమిషనర్‌గా బి. సుమతికి బాధ్యతలు

2లో



## పౌల్ట్రీ రంగంలో

# కొత్త మార్కెట్ రావాలి

- రాష్ట్రంలో వినియోగం పెంపు, ఎగుమతులు ఎంతో కీలకం
- పెట్టుబడులను ఆహ్వానించాలి
- తెలంగాణలో పౌల్ట్రీ ఉత్పత్తుల పంథా 2025 నివేదికలో వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమ దేశంలోనే అగ్రగామిగా ఎదగడానికి కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషించాలని, స్థానిక వినియోగాన్ని మరింత పెంచాలని హైదరాబాద్‌లోని జాతీయ పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ సూచించింది. తెలంగాణ బ్రాండ్ సృష్టించడంతో పాటు శుద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పనతో ఎగుమతి అవకాశాలను పెంచాలని, పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్దేశించింది. సీనియర్‌శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్,

తరువాయి 2లో


## నా టార్గెట్ డాడీ.. మోడీ..

# కచ్చితంగా సీఎం అవుతా..!

- గొప్ప లక్ష్యంతో పార్టీ పెడుతున్నా
- ఇటీవలి భేటీలో కవిత వ్యాఖ్యలు
- తెలంగాణ ప్రజాజాగృతి పార్టీ నేడు ఆవిర్భావం

2లో






## హెచ్‌సీఏ అక్రమాలపై హైకోర్టు సీరియస్..

# సిట్ దర్యాప్తునకు ఆదేశం

- **సీబీసీఐడీలోని సిట్‌తో విచారణ జరపాలని స్పష్టం**
- **జస్టిస్ నవీన్‌రావు పర్యవేక్షణలో హెచ్‌సీఏ పాలన**
- **అవినీతి జరిగితే కోర్టులు జోక్యం చేసుకుంటాయని వ్యాఖ్య**

హైదరాబాద్ : క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవకతవకలపై తెలంగాణ హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇకపై హెచ్‌సీఏ కార్యకలాపాలను జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని అపెక్స్ కౌన్సిల్ పర్యవేక్షించాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

తరువాయి 2లో

# బస్సులు రైట్..రైట్

హైదరాబాద్: ఆర్టీసీ ఐకాస నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. 11 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడానికి నిర్ణయించినట్లు అర్ధరాత్రి ఒంటిగంటకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మిగతా అంశాలను ఆర్టీసీ యాజమాన్యం, కార్మిక సంఘాలు కూర్చొని పరిష్కరించుకోవాలని తీర్మానించినట్లు భట్టి చెప్పారు. చర్చలు సఫలమయ్యాయని.. బస్సులు యథావిధిగా నడుస్తాయని రవాణాశాఖ మంత్రి పొన్నంప్రభాకర్ తెలిపారు. చర్చలు సఫలమవడంతో కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. దీంతో మూడు రోజులపాటు జరిగిన సమ్మెకు తెరపడినట్లయ్యింది. శనివారం ఉదయం తొలి షిఫ్టు నుంచి బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఉపముఖ్యమంత్రి, మంత్రుల బృందంతో చర్చలు జరిపిన ఐకాస నాయకులు 32 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ శంకర్‌గౌడ్‌కి నివాళి అర్పిస్తూ..సమావేశం ప్రారంభంలో మంత్రులు, అధికారులు, ఐకాస నేతలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. డ్రైవర్ శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

*** తొలుత అధికారులతో, తర్వాత మంత్రులతో...**

రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడంతో ఐకాస ఛైర్మన్ ఈదురు వెంకన్నతో పాటు నాయకులు థామస్‌రెడ్డి, అశ్వత్థామరెడ్డి, హనుమంతు ముదిరాజ్, మౌలానా, మల్లేశ్ తదితరులు ఉదయం సచివాలయానికి వెళ్లారు. 11 గంటలకు కమిటీలోని సీనియర్ ఐఏఎస్ అధికారులతో చర్చలు ప్రారంభమై భోజన విరామ సమయంలో ముగిశాయి. అనంతరం మంత్రి పొన్నం, కమిటీలోని అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి ఛాంబర్‌కు వెళ్లి చర్చల సారాంశాన్ని వివరించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఆర్టీసీ జేఏసీ నేతలతో సచివాలయంలో సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు సీఎస్ రామకృష్ణారావు, అధికారుల కమిటీ ఛైర్మన్ వికాస్‌రాజ్, ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, దానకిశోర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఐకాస నేతలు హాజరయ్యారు.

**సమస్యలను ఒక్కోటి వివరించిన ఐకాస**

తొలుత ఐకాస నాయకులు తమ 32 డిమాండ్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఒక్కో అంశంపై సమగ్రంగా డిప్యూటీ సీఎంకు, మంత్రులకు వివరించారు. వారంతా చెప్పిన విషయాలన్నింటినీ మంత్రుల బృందం సవివరంగా నోట్ చేసుకుంది. ఆర్టీసీ బోర్డు పరిధిలోని అంశాలు, సమస్యల్ని యాజమాన్యం, ఉద్యోగులు పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీకి, కార్మికులకు తమ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని, పరిష్కరించిన సమస్యలను వివరించారు. మంత్రులు, ఐకాస నాయకుల చర్చల్లో ఒకసారి టీ విరామం తీసుకోగా.. మధ్యమధ్యలో మంత్రులు కొద్దిసేపు విడిగా సమావేశమై అంతర్గతంగా చర్చించుకున్నారు. చర్చల్లో 2021, 2025 వేతన సవరణలు చేయాలని ఐకాస నాయకులు పట్టుబట్టారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని కోరినట్లు తెలిసింది.

**ఇది మన ప్రభుత్వం..ప్రజా ప్రభుత్వం: భట్టి**

అంతకుముందు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఐకాస నాయకులతో మాట్లాడుతూ... తెలంగాణలో ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. 'ఇది మన ప్రభుత్వం..ప్రజా ప్రభుత్వం' అని స్పష్టం చేశారు. ఆర్టీసీ రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అనీ, ప్రభుత్వ సహకారం ఉంటుందని వివరించారు. 'ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మరణించడం చాలా బాధాకరం. వ్యక్తి ఏస్థాయిలో ఉన్నా సరే, ప్రాణం అత్యంత విలువైనది. శంకర్‌గౌడ్ మరణంతో ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైంది. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున మేము, కార్మిక సంఘాల నేతలుగా మీరు సమష్టిగా కార్మికులకు పిలుపునిద్దాం' అని భట్టి సూచించారు. ఐకాస నాయకులు మాట్లాడుతూ... రెండు వేతన సవరణలు అమలు చేయడం, ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగుల విలీనంతో పాటు కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఉద్యోగుల ఇతర సమస్యలనూ వివరించారు. ఆర్టీసీలో యూనియన్లు లేకపోవడంతోనే ప్రభుత్వం అమలుచేస్తున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రచారం జరగలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 55 రోజుల సమ్మె చేసినప్పటికీ హామీల్ని అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 2013 వేతన సవరణ బాండ్స్ రూ.280 కోట్ల బకాయిల్ని తీర్చడంతో పాటు 2017కి సంబంధించి పీఆర్సీ, పెండింగ్ డీఏలు లేకుండా ఇచ్చిందన్నారు.

# ఆప్‌లో తుపాను

ఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి శుక్రవారం భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి రాజ్యసభలో ఉన్న 10 మంది ఎంపీల్లో ఏడుగురు తిరుగుబాటు బావుటా ఎగుర వేశారు. ఆప్‌ను వీడి భాజపాలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. చీలిక వర్గం ఎంపీలు 2/3 వంతుకు పైగా ఉండటంతో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం ఎగువసభ సభ్యత్వాలను కోల్పోయే ప్రమాదం ఉండదు. కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా చీలికకు నేతృత్వం వహించడం గమనార్హం. తనతో పాటు మరో ఆరుగురు ఆప్ రాజ్యసభ ఎంపీలు భాజపాలో విలీనం కానున్నట్లు దిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ ప్రకటించారు. ఈ భేటీలో అశోక్ మిత్తల్, సందీప్ పాఠక్ కూడా పాల్గొన్నారు. మిగిలిన నలుగురు ఎంపీలు సమావేశానికి హాజరుకానప్పటికీ చీలికకు మద్దతు తెలిపారని, సంబంధిత లేఖలను శుక్రవారం ఉదయమే రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించామని రాఘవ్ వెల్లడించారు. రాజ్యసభలో ఆప్ ఉపనేత పగ్గాల నుంచి రాఘవ్‌ను ఇటీవల తప్పించి ఆ స్థానంలో అశోక్ మిత్తల్‌ను పార్టీ నాయకత్వం నియమించింది. ఇప్పుడు చద్దా వెంటే అశోక్ మిత్తల్ కూడా వెళ్లడంతో ఆప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. పంజాబ్‌లోని అశోక్ మిత్తల్ వ్యాపార సంస్థల్లో ఇటీవలే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. దిల్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన స్వాతి మాలీవాల్ ఇది వరకే పార్టీ నాయకత్వంతో విభేదించినా ఆప్ సభ్యురాలుగానే ఇప్పటి వరకూ కొనసాగారు. ఈ ముగ్గురితో పాటు హర్భజన్ సింగ్, సందీప్ పాఠక్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ కూడా భాజపాలో చేరనున్నారు. రాజ్యసభలో ముగ్గురు..సంజయ్ సింగ్, ఎన్.డి.గుప్తా, బల్బీర్ సింగ్; లోక్‌సభలో ముగ్గురు...గుర్మీత్ సింగ్, రాజ్‌కుమార్, మహిందర్ సింగ్ మాత్రమే ఆమ్ ఆద్మీ పార్టీకి మిగిలారు.

**కారణమిదే: రాఘవ్ చద్దా**

'నేను పార్టీ కార్యకలాపాలకు దూరం జరగడానికి గల కారణం ఇప్పుడు చెబుతున్నాను. ఏ ఉద్దేశాలతో ఆప్ ఏర్పడిందో వాటికి దూరంగా జరిగింది. కొన్నేళ్లుగా దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. నేను వారి నేరాల్లో భాగం కావాలని అనుకోవడం లేదు. సరైన పార్టీలో ఉన్న భావన నాలో లేదు. అందుకే ఆప్‌నకు దూరమై, ప్రజలకు దగ్గరవుతున్నా'నని రాఘవ్ చద్దా ప్రకటించారు.

**ఇది భాజపా కుట్ర: ఆప్ నేతలు**

కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా మరోసారి పంజాబీలకు ద్రోహం చేసిందని ఆప్ అగ్రనేత కేజ్రీవాల్ మండిపడ్డారు. పార్టీని వీడిన ఏడుగురు ఎంపీల్లో స్వాతి మాలీవాల్ మినహా అందరూ పంజాబ్ నుంచే రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాఘవ్ చద్దాను ఒక పావుగా వాడి తమ పార్టీలో చీలిక తెచ్చేందుకు భాజపా కుట్ర పన్నిందని ఆప్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. మంత్రిని చేస్తామంటూ చద్దాకు కేంద్రమంత్రి అమిత్ షా ఆశపెట్టారని పేర్కొన్నారు. తమ ఎంపీలను ఈడీ దాడులతో భయపెట్టారనీ విమర్శించారు. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలంటూ భాజపా తోసిపుచ్చింది.

# పౌల్ట్రీ రంగంలో కొత్త మార్కెట్ రావాలి

హైదరాబాద్: తెలంగాణ పౌల్ట్రీ పరిశ్రమ దేశంలోనే అగ్రగామిగా ఎదగడానికి కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషించాలని, స్థానిక వినియోగాన్ని మరింత పెంచాలని హైదరాబాద్‌లోని జాతీయ పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ సూచించింది. తెలంగాణ బ్రాండ్ సృష్టించడంతో పాటు శుద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పనతో ఎగుమతి అవకాశాలను పెంచాలని, పెట్టుబడులను ఆహ్వానించాలని నిర్దేశించింది. సీనియర్‌శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, ప్రకాశ్, రామారావులతో కూడిన బృందం రాష్ట్ర పౌల్ట్రీ రంగంపై అధ్యయనం చేసి తెలంగాణలో పౌల్ట్రీ ఉత్పత్తుల పంథా (ప్రొడక్షన్ ట్రెండ్స్) 2025 పేరిట తాజాగా నివేదికను విడుదల చేసింది.

**సమస్యల కూత**

తెలంగాణ దక్కన్ పీఠభూమిలో ఉష్ణమండల వాతావరణాన్ని కలిగి ఉంది. ఎండాకాలంలో వ్యాధులు ప్రబలడంతో పాటు కోళ్ల, గుడ్ల వృద్ధికి ఆటంకంగా మారి భారీ ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయి. దాణా ధరలు ఏటా పెరుగుతున్నాయి. సరైన వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, టీకాలు అందుబాటులో లేవు. శీతల గిడ్డంగుల లోపం నిల్వలు, ఎగుమతులకు విఘాతంగా మారింది. వ్యాధులతో చనిపోయిన కోళ్ల నిర్మూలన ఇబ్బందికరంగా మారింది. స్థిరమార్కెట్ లేకపోగా ధరలలో అస్థిరత రైతులకు నష్టదాయకంగా మారింది. నాటుకోళ్ల పెంపకానికి రైతులకు తగినంత స్థలం, పెట్టుబడి సాయం లేదు.

**ఇలా చేయాలి...**

''రాష్ట్ర పౌల్ట్రీ రంగం దేశంలో మొదటి స్థానం పొందడానికి అవకాశం ఉంది. ప్రభుత్వపరంగా మద్దతు ఎంతో అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగంలో సమస్యలపై దృష్టి సారించి పరిష్కారాలను కనుగొనాలి. స్థిరమైన వృద్ధి సాధించాలంటే పౌల్ట్రీ ఉత్పత్తుల స్థానిక వినియోగాన్ని పెంచాలి. ఇతర రాష్ట్రాలు, విదేశాలలో మార్కెట్‌ను అన్వేషించాలి. గుడ్లు, మాంసం రెండింటి ఎగుమతులపై దృష్టి సారించాలి. నాణ్యత, విలువ జోడింపు ద్వారా తెలంగాణకు ప్రత్యేక బ్రాండ్‌ను రూపొందించాలి'' అని డీపీఆర్ శాస్త్రవేత్తలు సూచించారు.

**వివరాలు ఇలా..**

- రాష్ట్రంలో 1,839 కంపెనీలు వాణిజ్య పౌల్ట్రీ, గుడ్ల ఉత్పత్తి రంగంలో ఉన్నాయి. సుమారు 10.06 లక్షల మంది రైతులు నాటు కోళ్లను పెంచుతున్నారు.
- 2015లో 7.38 కోట్ల కోళ్లు ఉండగా ..2024 నాటికి 11.19 కోట్లకు పెరిగాయి.
- అలాగే వాణిజ్య కోళ్లు 5.94 కోట్లు కాగా 10.46 కోట్లకు చేరాయి
- గుడ్లు 1,061 కోట్లు ఉత్పత్తి కాగా.. 1,935 కోట్లకు పెరిగాయి.
- 201524 మధ్య కాలంలో, దేశవ్యాప్త చికెన్ (కోడి మాంసం) ఉత్పత్తిలో 53% వృద్ధి నమోదు అయింది. 2015లో 222 లక్షల టన్నులు కాగా 2025లో 489.77 లక్షల టన్నులు.
- జాతీయ స్థాయిలో మొత్తం కోడి మాంసం ఉత్పత్తి 4.64% పెరగగా, రాష్ట్రంలో మాత్రం దాని వాటా 3.73% తగ్గింది.
- రాష్ట్రంలో రోజుకు 4.84 కోట్ల గుడ్లు, 9.5 లక్షల బ్రాయిలర్ కోళ్ల ద్వారా 1,320.1 టన్నుల చికెన్ లభ్యమవుతోంది.
- 202425లో రాష్ట్రంలో గుడ్ల తలసరి లభ్యత 510గా ఉంది. ఇది జాతీయ సగటు 101 కంటే చాలా ఎక్కువ. ఆంధ్రప్రదేశ్ (526 గుడ్లు) తర్వాత దేశంలో ఇది రెండో అత్యధికం.
- ఫారం కోడి గుడ్ల ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం మూడు, మాంసం ఉత్పత్తిలో ఐదో ర్యాంకులతో ఉంది. వాణిజ్య కోళ్ల పెంపకంలో 7వ స్థానం పొందింది.
- తెలంగాణలో కోడి మాంసం తలసరి లభ్యత 28.51 కేజీలు.. ఇది దేశంలోనే అత్యధికం. దేశ సగటు 7.1 కేజీల కంటే చాలా ఎక్కువ.

# హెచ్‌సీఏ అక్రమాలపై హైకోర్టు సీరియస్.. సిట్ దర్యాప్తునకు ఆదేశం

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవకతవకలపై తెలంగాణ హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇకపై హెచ్‌సీఏ కార్యకలాపాలను జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని అపెక్స్ కౌన్సిల్ పర్యవేక్షించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. హెచ్‌సీఏలో జరుగుతున్న అక్రమాలపై సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ నగేష్ భీమపాక కీలక వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీఏకు స్వయం ప్రతిపత్తి ఉన్నంత మాత్రాన న్యాయవ్యవస్థ పరిధి నుంచి తప్పించుకోలేదని తేల్చి చెప్పారు. అవినీతి, అక్రమాలు జరిగినప్పుడు పారదర్శకత కోసం కోర్టులు కచ్చితంగా జోక్యం చేసుకుంటాయని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తునకు హెచ్‌సీఏ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలతో హైదరాబాద్ క్రికెట్ సంఘంలోని వ్యవహారాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# నా టార్గెట్ డాడీ.. మోడీ.. కచ్చితంగా సీఎం అవుతా..!

హైదరాబాద్ : ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడంలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ రెండూ విఫలమయ్యాయి. ఇక.. అధికారం అడ్డం పెట్టుకొని బీజేపీ చేస్తున్న అరాచకాలను మీరు చూస్తూనే ఉన్నారు. అమర వీరుల ఆశయాల సాధనే ధ్యేయంగా నేను పార్టీ పెడుతున్నాను. చూస్తూనే ఉండండి. నేను కచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా. ఇక నా ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు ఎవరంటారా? ఒకరు మోడీ..రెండు డాడీ. జనంలోకి వెళతా.. ప్రజా సమస్యలపై పోరాడతా. కచ్చితంగా ఎవరూ ఊహించని మార్పు తెస్తా.. అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కొంతమంది అనుచరులతో భేటీ అయిన ఆమె తన లక్ష్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని, మాజీ ముఖ్యమంత్రి, గులాబీ దళపతి కేసీఆర్ అని వారికి స్పష్టబరిచారు. కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం కోసం గత కొన్ని రోజులుగా వివిధ సామాజిక వర్గాల వారితో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె.. తన తండ్రే తన ప్రధాన ప్రత్యర్థి అంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

**సమస్యలు చెప్పండి.. స్పందిస్తా**

ఎక్కడ ఏ సమస్య ఉన్నా చెబితే తాను వెంటనే స్పందిస్తానని కవిత ఈ భేటీలో చెప్పారు. సమాజంలో పలుకుబడి కలిగిన పెద్దలు తాను పెడుతున్న పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ఏదైనా నియోజకవర్గానికి ఎమ్మెల్యే అవుదామన్న మంచి లక్ష్యంతో వస్తే తాను పార్టీ నుంచి టికెట్ కూడా ఇస్తానని చెప్పారు. తన పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని తాను సీఎంను కూడా అవుతానని ఆమె విశ్వాసం ప్రకటించారు. ఆర్థిక, రాజకీయ సంపన్నులు తన లాగే.. ప్రజాప్రతినిధి అవుతాననే లక్ష్యంతో పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు.

**శ్ర కొత్త పార్టీ పేరు.. తెలంగాణ ప్రజా జాగృతి**

రేపు ఉదయం ఆవిర్భవించనున్న పార్టీ పేరు తెలంగాణ ప్రజా జాగృతి.. అని విశ్వసనీయ సమాచారం. అయితే సోషల్ మీడియాలో రకరకాల పేర్లతో వార్తలు వస్తున్నప్పటికీ అవేవీ నిజం కాదని తెలుస్తున్నది. తెలంగాణ ప్రజా జాగృతి పేరుతోనే పార్టీ పేరు ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయ్యిందని ఇదే పేరును అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తున్నది. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న అద్వయ కన్వెన్షన్ హాల్‌లో శనివారం (ఏప్రిల్ 25) పార్టీ ఆవిర్భావ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే.

# తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు..

తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో కీలక మార్పులు చేపట్టింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక, రాష్ట్ర తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్ రానున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఉన్న 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్‌కు హోంశాఖ బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కూడా ఆమె కొనసాగిస్తారు. శిఖా గోయల్ బదిలీతో, ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీవీ ఆనంద్‌కు డీజీపీగా పదోన్నతి లభించే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో 1996 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌ను నియమిస్తారని భావిస్తున్నారు. ఆనంద్ గతంలో హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా, ఏసీబీ డీజీగా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రభుత్వం మరో ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను కూడా బదిలీ చేసింది. దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమించారు. షానవాజ్ ఖాసింను మల్టీజోన్II ఐజీగా బదిలీ చేశారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషి బాధ్యతలు చేపట్టనున్నారు. అవినాష్ మహంతిని డ్రగ్స్ కంట్రోల్ డీజీగా, ఎక్సైజ్ డైరెక్టర్‌గా నియమించారు. మల్కాజ్‌గిరి కొత్త పోలీస్ కమిషనర్‌గా బి. సుమతిని నియమించారు. ఐజీపీ, ఎస్ఐబీగా కార్తికేయకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

# మే 4: టీఎంసీ గూండాల ఆట కట్టే రోజు!

ఢిల్లీ : మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

# మొజ్తబా ఖమేనీకి ప్లాస్టిక్ సర్జరీ?

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారు, స్పృహలోనే ఉన్నారు. కానీ ఓ దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఆయన ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలను 'ది న్యూయార్క్ టైమ్స్' తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది.

**తీవ్ర గాయాలు.. రహస్య పాలన**

పత్రిక కథనం ప్రకారం మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. అయితే, ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్/జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్,**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లాలో 20262028 సంవత్సరానికి సంబంధించిన మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందించాలని, ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డీపీఆర్ఓ పి. రాజేంద్ర ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సి.హెచ్ శ్రీనివాస్, ఈరగాని బిక్షం, వేముల అయోధ్య రామయ్య, నవాబ్, , షేక్ అక్రం, ఎం.మోహన్ రెడ్డి, గాడిపెల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు

# భూపాలపల్లిలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె

*** కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు**




భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : ఆర్టీసీ కార్మికుల సమ్మె భూపాలపల్లిలో మూడో రోజుకీ కొనసాగుతోంది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ కార్మికులు బస్ డిపో ఎదుట నిరవధిక ధర్నా చేపట్టారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ధర్నా ప్రారంభానికి ముందు ఆయన మృతి కి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ధర్నా స్థలాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని ఆమె విమర్శించారు. సమ్మె కారణంగా బస్సుల రాకపోకలు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కార్మికులు కూడా తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు.

# ఫిన్లాండ్ పర్యటన ముగించుకొని స్వదేశంకు వస్తున్న ఉపాధ్యాయులు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : ఉపాధ్యాయ బాధ్యతగా ఫిన్లాండ్ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి వస్తున్న కిష్టాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు దాముక కమలాకర్, అక్కపెల్లిగూడెం ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్‌కు రేండ్లగూడ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీ రాముల గంగాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విదేశీ పర్యటనలో నేర్చుకున్న విద్యా విధానాలను ఇక్కడి విద్యార్థులకు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, సామాజికవేత్త భూమాచారి, రేండ్లగూడ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శులు వి.రవిచారి, బింబోజు లక్ష్మీ నర్సయ్య, ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లోని చింతగూడ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సర్పంచ్ సుతారి సుమలత బుధవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు.పని జరుగుతున్న ప్రాంతంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని,ఎండ నుంచి రక్షణ కోసం నీడ నెట్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, కార్యదర్శి రాజన్న, ఉప సర్పంచ్ అసంపెల్లి కావ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు కాదు.... పోరాటమే మార్గం

**– ఆర్టీసీ కార్మికులకు పలువురు నాయకుల మద్దతు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యలకు మార్గం కాదని, ధైర్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద భారీ ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. సమ్మెకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులతో తగవు పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ, పనిభద్రత, బకాయిల చెల్లింపు, కొత్త బస్సుల కొనుగోలు వంటి డిమాండ్లు సాధ్యమైనవేనని ఆయన పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా మాట్లాడుతూ, చట్టబద్ధ సమ్మెపై అరెస్టులు, నిర్బంధాలు విధించడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం మొండివైఖరిని విడిచి వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

**– ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం: వనమా వెంకటేశ్వరరావు**

మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వేసవిలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

**– కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, షెడ్లు, తూకం యంత్రాలు, రవాణా సదుపాయాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు, త్రాగునీటి సమస్యలపై వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు వివరాలు, కొనుగోలు ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలపై అధికారుల నుండి వివరణ తీసుకున్నారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియలో ఆటంకాలు రాకుండా చూడాలని సూచించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయం కలిగితే తక్షణమే పరిష్కారం చూపడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిరంతరంగా తాగునీరు అందేలా చూడాలని సూచించారు. టేకులపల్లి ప్రాంతంలో త్రాగునీటి సమస్య తమ దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరించి సరఫరా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కింద సోమవారం నుండి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్, ''సే నో టు డ్రగ్స్'' కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మీ, సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, పంచాయతీ అధికారి సుధీర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ హెయిర్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ డిపోలో హెయిర్ బస్ డ్రైవర్ల సమావేశం పాక చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యూనియన్ గౌరవ అధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న పాల్గొని మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనం ఇచ్చి డ్రైవర్ల శ్రమ దోపిడిని యజమాన్యాలు చేస్తున్నాయి ఇప్పటికైనా డ్రైవర్లకు కనీస వేతన 26,000 ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రతి డ్రైవర్ కి యజమాని వ్యక్తిగత ఇన్సూరెన్స్ చేయించాలని మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి బస్సులు ఎక్కువ మంది ఎక్కడ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైనా బస్సు కెపాసిటీ కేవలం 60 మంది మాత్రమే కానీ 100 నుండి 150 మంది ఎక్కడ వల్ల డ్రైవర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా వేధింపులు తగ్గించాలని ఇండ్లు లేని డ్రైవర్ కు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డ్రైవర్ల కి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం శ్రావణ్, వెంకటేష్, రవీందర్, మహేందర్, రాజు, రాకేష్, కొమురవెల్లి, వంశి, మధు, ఐలయ్య, కృష్ణ,శ్రీశైలం, మోహన్,రాజు, వెంకన్న, ఐలేష్ ,ఉపేందర్, నాగరాజు, వీరన్న, వీరస్వామి, యాకన్న, దుర్గేష్, నగేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేసిన ఆర్యవైశ్యులు

*** పాల్గొన్న డిసిసి అధ్యక్షులు ఉమా మురళి నాయక్.**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్యవైశ్యులు డిసిసి అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మానుకోట ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకట రామారావు ఆధ్వర్యంలో పాలాభిషేక కార్యక్రమం నిర్వహించగా డిసిసి అధ్యక్షులు ఉమా మురళి నాయక్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని జీవో ఇవ్వడం ఎంతో అర్షనీయమైనదని ఈ జీవో ద్వారా వాసవి మాతకు ప్రభుత్వం ప్రత్యేకంగా వాసవి జయంతిని నిర్వహిస్తుందని ఆర్యవైశ్యులకు తెలిపారు . గతం ప్రభుత్వాలు వాసవి జయంతిని ప్రభుత్వం నిర్వహించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు 19వ వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్,నాళ్ళ నరసింహారావు, భువనగిరి గిరిధర్ గుప్తా, జంగాల సదాశివుడు, ప్రతాపని పాండురంగయ్య, జంగాల నరసింహారావు ,చిదిరాల శరత్, చిదిరాల ఉమా శంకర్, భువనగిరి ప్రసాద్, సోమ శ్రీనివాస్, గెల్లి మురళి, సుమతి, ఉమా కాంగ్రెస్ కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూనంనేనిని పరామర్శించిన జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఇటీవల హైదరాబాదులో మోకాలి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్న కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావును జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.మొగిలి శుక్రవారం కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యేకు జరిగిన శాస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకొని తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కూనంనేని కృషితో నియోజకవర్గంలో ఎంతో మంది ప్రతిభవంతులైన క్రీడాకారులుగా రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగి పతకాలు సాధించారని అన్నారు. నియోజకవర్గంలో కావలసిన క్రీడా మైదానాల కోసం కృషి చేస్తున్నారని, అవి కూడా త్వరలో పూర్తియి కొత్తగూడెం ఒక క్రీడా హబ్ గా తయారు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేను పి.కాశీ హుస్సేన్, ఇ.మొగిలి శాలువతో ఘనంగా సత్కరించారు.

# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

- **అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**
- **అందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు**



అందోలు, ప్రజాస్ఫూర్తి :అంగన్వాడి కేంద్రాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1,16,17,28 వార్డులలోని అంగన్వాడి కేంద్రాల అన్యువల్ డే కార్యక్రమాన్ని స్థానిక ముదిరాజ్ సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చిన్నారులు వారి విద్యా సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వారు ప్రత్యేకమైన దుస్తులు ధరించి, చేతులలో సర్టిఫికెట్ లు పట్టుకొని పై తరగతికి వెళ్లిపోతున్నామని అనందోత్సాహంలో మునిగిపోయారు. అంగన్వాడీ స్థాయి నుండి ప్రాథమిక పాఠశాలలోకి వెళ్తున్నందుకు వారిని వైస్ చైర్మన్ చిట్టిబాబు అభినందించారు. ప్రతి ఒక్క చిన్నారి పాఠశాలలో ఉండాలని అన్నారు. చిన్నారులకు సత్కారం చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రీ స్కూల్ కి సంబంధించిన ప్రతి విషయాన్ని వారికి కూలంకషంగా అంగన్వాడి టీచర్లు వివరించి వారిని పై చదువులకు వెళ్లే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గడ్డి అరుణ్ కుమార్, పట్లోళ్ల శ్రీనివాస్, మేఘారాణి సైలని, శశిరేఖ అనిల్ కుమార్, అంగన్వాడీ టీచర్స్ మరియా, నగ్మా, పుష్పలత, స్వరూప, సరిత, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు, మైనార్టీ నాయకుడు అడ్డు భాయ్,బాబా భాయ్ పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు అందుకున్న కుక్కముడి వెంకన్న



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా, మండలం, జమండ్లపల్లి గ్రామానికి చెందిన కుక్కముడి వెంకన్న ఎన్నో ప్రజా సేవ కార్యక్రమాలు చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డా,, బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా షెడ్యూల్ కులాల హక్కుల పరి రక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ బాబు చేతుల మీదుగా అవార్డు తీసుకొని, శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా దళిత రత్న అవార్డు కుక్కమూడి వెంకన్న తీసుకోవడం జరిగింది. సోమారపు వీరస్వామి జిల్లా కలెక్టరుకు తాళ్లపల్లి యాకమ్మ రచించిన "పిడికిలి" గ్రంథాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అతిధులుగా ఎస్ సి ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు సోమారపు వీరాస్వామి, జమండ్లపల్లి 3వ వార్డు కౌన్సిలర్ రజిత లింగస్వామి, బి ఆర్ ఎస్ 2వ వార్డు అధ్యక్షులు అంబాల గోవర్ధన్, 3వ వార్డు అధ్యక్షులు మారగాని సురేష్, మాజీ కౌన్సిలర్ అంబాల జ్యోత్స్న శివకుమార్, ఏఎంసి డైరెక్టర్ మల్లయ్య, రావుల యాకయ్య, అంబాల కుమార్, శనిగరపు కుమార్, పుట్ట సత్యనారాయణ, సన్నిల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మన జనగణన – మన అభివృద్ధి' పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ అంకిత్




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:'మన జనగణన - మన అభివృద్ధి'' కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో సరైన ప్రణాళికలు రూపొందించడానికి ఖచ్చితమైన సమాచారం అవసరమని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించబడే సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల జిల్లా అధికారులు తమ పరిధిలోని జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ఉన్న ఉద్యోగులు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవ రావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ ల్యాండింగ్.. కానీ 35 ఏళ్లుగా అక్కడే: విమానం స్టోరీ వైరల్

ఇంజిన్‌లో లోపం వల్ల మహారాష్ట్రలో నాగ్‌పుర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో బోయింగ్ 720 విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. అది జరిగి సరిగ్గా ఇప్పటికి 35 ఏళ్లు. ఏ క్షణాన అది దిగిందో.. ఇప్పటికీ ఎయిర్‌పోర్ట్ నుంచి కదల్లేదు. 'ఏవియేషన్‌ఆల్' ఎక్స్ ఖాతాలో పోస్టు ద్వారా ఈ విమానం స్టోరీ మళ్లీ వెలుగులోకి వచ్చింది.

**కొన్నేళ్లపాటు ముప్పుగా..**

బోయింగ్ 720 విమానం (Boeing 720) కాంటినెంటల్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (CPAL) ఆధ్వర్యంలో నడిచేది. సాంకేతిక లోపం కారణంగా 1991లో నాగ్‌పుర్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. తర్వాత మరమ్మతులు చేసి దానిని అక్కడి నుంచి తరలిస్తారని అంతా భావించారు. కానీ రన్‌వే సమీపంలోనే కొన్నేళ్లపాటు నిలిచిపోయింది. బోయింగ్ 720 మోడల్ విమానాలను 1959 నుంచి 1967 వరకు ఉత్పత్తి చేశారు. 1960లో దాని కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా మధ్యస్థాయి మార్గాల (150 నుంచి 3,200 నాటికల్ మైళ్లు) కోసం దీనిని తీసుకువచ్చారు. ప్రారంభంలో యూఎస్ సంస్థలు యునైటెడ్, ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ వీటిని నడిపేవి. 2010లో దీని సేవలను నిలిపివేశారు. అంతర్జాతీయ ప్రయాణాల్లో కీలకంగా నిలిచిన ఈ విమానం.. నాగ్‌పుర్‌లో ఓ ల్యాండ్‌మార్క్‌గా మారిపోయింది .అమెరికా, ఐరోపాలోని పలు విమానయాన సంస్థ కార్యకలాపాల్లో భాగమైన ఈ బోయింగ్ 720.. తర్వాత సీపీఏఎల్ చేతికి రావడంతో దాని ప్రయాణం భారత్‌కు చేరింది. 1991, జులై 21న అది ల్యాండ్ అయిన తర్వాత ఒక సమస్యగా మారిపోయింది. దానిని మరమ్మతు చేసి తీసుకెళ్లకపోవడం ఒక సమస్య అయితే.. రన్‌వే పైనే ఉండిపోవడం మరో ప్రాబ్లెమ్. ఇక చూసీచూసి 1993లో రన్‌వే నుంచి 90 మీటర్లు దూరంగా జరిపారు. మామూలుగా విమానయాన నిబంధనల ప్రకారం.. రన్‌వేకు 150 మీటర్ల పరిధిలో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదు. దాంతో ఇది కొన్నేళ్లపాటు ఒక ముప్పుగానే ఉండిపోయింది.

*** అసలు ఆ విమానాన్ని ఎందుకు కదిలించలేదు..?**

ముప్పు పొంచి ఉన్నా ఆ విమానాన్ని కదిలించకపోవడానికి గల కారణం తెలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. న్యాయపరమైన చిక్కులే ప్రధాన కారణం. కాంటినెంటల్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని శామ్ వర్మ ఓ సందర్భంలో మాట్లాడుతూ.. ''సమీపంలో లీజుకు తీసుకున్న ప్రాంతానికి



దానిని తరలించేందుకు మేం అనుమతి కోరాం. కానీ ఎయిర్‌పోర్ట్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. ఇన్ని రోజులు ఇక్కడ పార్క్ చేసినందుకు చెల్లించాల్సిన ఖర్చుల గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. అద్దెకు ఉంటున్న వ్యక్తిని ఇంట్లోనే ఉంచి.. అద్దె ఇమ్మని బలవంతం చేయడంలా అనిపించింది'' అని ఆరోపించారు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ తర్వాత ఈ విమానాన్ని అలా గాలికి వదిలేశారని ఎయిర్‌పోర్ట్ అధికారులు మరో వాదన వినిపించారు. ఇలా ఈ సమస్య ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాకుండా మిగిలిపోయింది. ఇప్పుడు కట్టాల్సిన పార్కింగ్ ఛార్జీలు రూ.7 కోట్లకు పెరిగాయని జాతీయ మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. దానిని వేరే ప్రాంతానికి తరలించే అంశంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) సీరియస్ కావడంతో దానిని నాగ్‌పుర్ ఫ్లయింగ్ క్లబ్‌కు తరలించారు. దాన్ని ఓ రెస్టరంట్, మ్యూజియం, శిక్షణాకేంద్రంగా మారుద్దామనుకున్న ప్రయత్నాలు కూడా ఫలించలేదు. న్యాయపరమైన చిక్కులు, ఖర్చులు చూసి అధికారులు వెనకడుగు వేశారు. చక్రాలు నేలలో కలిసిపోయి.. అద్దాలు మసగ్గా మారి.. రంగు అంతా కొట్టుకుపోయి.. నాగ్‌పుర్ విమానాశ్రయంలో దిగిన ప్రయాణికులకు ఒక సాక్ష్యంగా అది మిగిలిపోయింది..!


## పావురం ఎగురవేసినందుకు విజయ్‌కు పెటా లేఖ



చెన్నై: ఎన్నికల ప్రచారంలో పావురాన్ని ఎగురవేసిన వ్యవహారమై నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు జంతుసంక్షేమ సంస్థ.. పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్(పెటా) లేఖ రాసింది. తిరుచ్చి ఈస్ట్‌లోని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీవీకే అధ్యక్షుడు, ఆ నియోజకవర్గం అభ్యర్థి విజయ్ చేతికి ఓ కార్యకర్త తెల్లటి పావురాన్ని అందించగా దానిని ఆయన ఎగురవేశారు. ఆ పావురం రెక్కలకు టీవీకే జెండాలోని రంగులు ఉన్నాయి. ఈ విషయమై పెటా లేఖ రాసింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన సూచనల ప్రకారం ప్రచారాల్లో మూగజీవాలను ఉపయోగించడం నిషేధమని తెలిపింది. పావురాలకు ఎక్కువ గ్రాహక శక్తి ఉంటుందని, వాటికి రంగులు వేయడం, బంధించడం, జనసమూహాల మధ్య అకస్మాత్తుగా ఎగురవేయడం వంటి చర్యలు వాటిని తీవ్ర మానసిక ఒత్తిడికి, గందరగోళానికి గురిచేస్తాయని వెల్లడించింది. విజయ్ వద్ద మరిన్ని పక్షులు ఉంటే వాటిని పునరావాసం కోసం అప్పగించాలని సూచించింది.

## ఆమ్‌ఆద్మీకి రాజీనామా.. భాజపాలోకి రాఘవ్ చడ్డా..!

ఆమ్‌ఆద్మీ పార్టీ (AAP)కి రాఘవ్ చడ్డా రాజీనామా చేశారు. భాజపాలో చేరనున్నట్లు చెప్పారు. ఇటీవలే ఆయన్ను పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి ఆప్ తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో చడ్డా మాట్లాడుతూ.. ''రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాజ్యసభలో ఆప్‌నకు చెందిన మూడింట రెండొంతుల మంది సభ్యులమైన మేము భాజపాలో విలీనం కావాలని నిర్ణయించుకున్నాం. 15 ఏళ్లపాటు నా రక్తం, చెమట ధారపోసి ఆప్ ఎదుగుదలకు కృషి చేశా. కానీ, అది ఏ ఉద్దేశాలతో ఏర్పడిందో వాటికి దూరంగా జరిగింది. కొన్నేళ్లుగా ఆ పార్టీ దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. సరైన పార్టీలో ఉన్న భావన నాలో



లేదు. అందుకే ఆప్‌నకు దూరమై, ప్రజలకు దగ్గరవుతున్నానని ప్రకటిస్తున్నాను'' . ''నేను పార్టీ కార్యకలాపాలకు దూరం జరగడానికి గల కారణం ఇప్పుడు చెబుతున్నాను. నేను వారి నేరాల్లో భాగం కావాలని అనుకోవడం లేదు. భాగం కాలేదు కాబట్టి.. వారి స్నేహాన్ని పొందలేకపోయాను. మా ముందు రెండే దారులు కనిపించాయి. అయితే రాజకీయాల నుంచి దూరం జరగాలి. లేకపోతే మా అనుభవాన్ని ఉపయోగించి సానుకూల రాజకీయాలు చేయాలి. అందుకే భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నాం '' అని చడ్డా అన్నారు. ఆయనతో పాటు స్వాతి మాలీవాల్, హర్భజన్ సింగ్, సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ భాజపాలో చేరనున్నారు. ''రాజ్యసభలో ఆప్ బలం 10. ఏడుగురం కలిసి ఉన్నాం. ఈ ఉదయం సంతకాలు చేసిన లేఖలను రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించాం'' అని చడ్డా వెల్లడించారు.

**చడ్డాను ఒక పావుగా వాడి..**

రాఘవ్ చడ్డాను ఒక పావుగా వాడి తమ పార్టీలో చీలిక తెచ్చేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆప్ ఆరోపించింది. ఏడుగురు ఎంపీలను తీసుకువస్తే.. మంత్రిని చేస్తామని చడ్డాకు కేంద్రమంత్రి అమిత్ షా చెప్పినట్లుగా తమకు సమాచారం ఉందని వ్యాఖ్యలు చేసింది. అయితే ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని భాజపా (BJP) తోసిపుచ్చింది.

## CBSE రెండో విడత 'పది' పరీక్షలు..

## ఆ ఒక్క సబ్జెక్టుకే 4.74లక్షల మంది దరఖాస్తు!

దిల్లీ: సీబీఎస్‌ఈ పదో తరగతి రెండో విడత పరీక్షలకు షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. మే 15 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు మొత్తంగా 6,68,854 మంది దరఖాస్తు చేసుకున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. రెండో విడతలో మార్కుల ఇంప్రూవ్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 4,74,491 మంది ఒక్క సైన్స్ సబ్జెక్టునే ఎంచుకోవడం గమనార్హం. అలాగే, మొత్తంగా మార్కుల మెరుగుకోసం 5,26,655 మంది దరఖాస్తు చేసుకోగా.. 85,285 మంది కంపార్టుమెంట్ పరీక్షలకు; 57,914 మంది విద్యార్థులు కంపార్ట్‌మెంట్, ఇంప్రూవ్‌మెంట్‌కు కలిపి దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సీబీఎస్‌ఈ తొలి విడత పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి మార్చి 10వ తేదీ వరకు జరగ్గా.. ఏప్రిల్ 15న ప్రకటించిన ఫలితాల్లో 93.70శాతం ఉత్తీర్ణత నమోదైంది. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంలో భాగంగా సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజెస్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టుల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసేందుకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ బోర్డు



నిర్ణయించింది. ఈ రెండు విడతల్లో విద్యార్థులు సాధించిన మెరుగైన స్కోరును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. అయితే, ఇంప్రూవ్‌మెంట్, కంపార్టుమెంట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నవారిలో 4,02,643మంది అబ్బాయిలు కాగా.. 2,66,209మంది బాలికలు ఉన్నట్లు బోర్డు తెలిపింది. ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,92,508మంది విద్యార్థులు ఒక సబ్జెక్టును ఎంచుకోగా.. 2,79,227 మంది రెండు సబ్జెక్టులు, 1,97,119మంది మూడు సబ్జెక్టులను ఎంచుకున్నట్లు తెలిపారు. రెండో విడత పదో తరగతి ఫలితాలను జూన్ నెలాఖరు నాటికి విడుదల చేసే అవకాశం ఉంది.

## రాఘవ్ చడ్డా రాజీనామా.. కేజ్రీవాల్ ఫస్ట్ రియాక్షన్

న్యూఢిల్లీ: ఏప్రిల్ 25: ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చడ్డా ఆ పార్టీకి రాజీనామా చేసి, భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. భాజపా తన చర్యలతో మరోసారి పంజాబీలను గట్టి దెబ్బ కొట్టిందని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఆ పార్టీ ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. తమ ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి భాజపా ఈడీ, సీబీఐలను



వాడుకుందని ఆరోపించారు. ''ఈ రోజు ఏడుగురు ఆప్ ఎంపీలు భాజపాలో చేరారు. తమను మోసం చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. రాఘవ్ చడ్డాను పార్టీ ఎమ్మెల్యే, ఎంపీని చేసింది. పంజాబ్ ప్రజలు సందీప్ పాఠక్‌ను ప్రేమతో రాజ్యసభకు పంపారు. రాజేంద్ర గుప్తా, విక్రమ్ సాహ్నీ, అశోక్ మిట్టల్, స్వాతి మాలీవాల్.. వీరందరికీ పార్టీ, పంజాబ్ ప్రజలు దిగువస్థాయి నుంచి ఉన్నత స్థానాలకు చేరుకొనే అవకాశం కల్పించారు. వారి ఆశీస్సుల వల్లే హర్భజన్‌సింగ్‌కు కూడా పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం లభించింది. కానీ, ఈ ఏడుగురూ రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు' అని సంజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆప్‌నకు డబుల్ షాక్**

రాజ్యసభలో తమ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వేటు వేసి.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు చడ్డాతో పాటు అశోక్ మిత్తల్ సైతం భాజపాలో చేరుతున్నట్లు ప్రకటించడంతో ఆప్‌నకు భారీ ఎదురు దెబ్బ తగిలినట్లైంది.

## బెంగాల్‌లో దీదీ.. తమిళనాట స్టాలిన్.. ఫరూక్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు

శ్రీనగర్: దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరిన వేళ జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా (Farooq Abdullah) ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న మూడు కీలక రాష్ట్రాల్లో ఇండియా కూటమి పక్షాలే అధికారంలోకి వస్తాయన్నారు. హజ్రత్‌బల్‌లో విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయని అడగ్గా.. ''మీతో పాటు అందరికీ నేను చెబుతున్నా.. బెంగాల్‌లో మమతా బెనర్జీనే గెలవబోతున్నారు. కేరళలో కాంగ్రెస్, తమిళనాడులో సీఎం స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే విజయం సాధిస్తాయి. ఇది ఆ భగవంతుడి ఆశీర్వాదం'' అని జోస్యం చెప్పారు. మధ్య ప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. శాంతి పునరుద్ధరణ అత్యావశ్యకమన్నారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలా జరగకపోతే.. ఈ ప్రపంచానికి సంభవించే విషాదాలు అత్యంత తీవ్రంగా ఉంటాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ (ప్రతి దేశం, ప్రతి నాయకుడు) ఈ యుద్ధం తక్షణమే ముగిసేలా చూసేందుకు తప్పక కృషి చేయాలని ఫరూక్ అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు. అమెరికాను యుద్ధం వైపు నెట్టేందుకు ఇజ్రాయెల్ వ్యవహరించిన తీరు సరిగా లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రహించారని, తక్షణమే ఆయన తగిన చర్యలు తీసుకుంటారని ఫరూక్ అబ్దుల్లా అభిప్రాయపడ్డారు. దేవుడి దయవల్ల వీలైనంత త్వరగా ఈ యుద్ధం ముగిసేలా చైనా, రష్యాలు కూడా చూసుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తం



చేశారు. మాదకద్రవ్యాలపై పోరుకు కేంద్రం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' గురించి స్పందిస్తూ.. ఈ పోరాటం విజయం సాధించాలంటే ప్రజల మద్దతు అత్యంత అవసరమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకపోతే డ్రగ్స్ ముప్పును అంతం చేయలేమని తెలిపారు.

## దిల్లీకి వస్తామన్న దీదీ.. అమిత్ షా నవ్వులు

బెంగాల్‌లో ఈసారి భాజపానే అధికారంలోకి వస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సిండికేట్, మాఫియా, గూండా రాజ్యానికి ముగింపు పలుకుతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కేంద్రంలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పి కొట్టారు. మమత వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయంటూ చిరునవ్వులు చిందించారు. దీదీకి బెంగాల్‌లోనే ఏమీ మిగలదంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికారాన్ని పోగొట్టుకొని ఆమె దిల్లీకి ఎలా వస్తారని ప్రశ్నించారు. కోల్‌కతాలో నిర్వహించిన





ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం పోలింగ్ సమయంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ భాజపాపై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన దృష్టిని దిల్లీపైకి మళ్లిస్తానన్నారు. ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి కేంద్రంలోని భాజపాను గద్దెదింపుతానని పేర్కొన్నారు. తమతో ఉంటూ భాజపా కోసం పని చేసిన ప్రతి ఒక్కరి పేర్లను తాను గుర్తుంచుకున్నానని అన్నారు. వారందరికీ తగిన గుణపాఠం చెబుతామన్నారు. భాజపా నేతలు తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు.

## ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని బలవంతం చేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : ఏడు నెలల గర్భాన్ని తొలగించుకునేందుకు 15 ఏళ్ల బాలికకు అనుమతిస్తూ.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని ఒక మహిళను మరీ ముఖ్యంగా బాలికను బలవంతం చేయలేమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది . అలా బలవంతం చేసే హక్కు ఏ న్యాయస్థానానికి లేదని స్పష్టంచేసింది. ''పుట్టబోయే బిడ్డ కంటే గర్భం కొనసాగించే విషయంలో ఆ మహిళ తీసుకునే నిర్ణయానికే ఎక్కువ



ప్రాధాన్యం ఉంటుంది . ఇష్టం లేకుండా ఆ బాలిక తన గర్భాన్ని కొనసాగిస్తే అది ఆమె మానసిక ఆరోగ్యం, విద్యావకాశాలు, సామాజిక స్థితిగతులపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఒక బిడ్డకు జన్మనిచ్చే విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆమెకు ఉండాలి. ఒక అవాంఛిత గర్భాన్ని కొనసాగించమని మహిళను ఒత్తిడి చేయడం అంటే.. ఆమె రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది'' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ''అవాంఛిత గర్భాన్ని కొనసాగించాల్సిందేనని కోర్టులు చెబితే.. అప్పుడు సదరు బాలికలు/మహిళలు కోర్టుకు రాకుండా చట్టవిరుద్ధంగా నడిచే అబార్షన్ కేంద్రాలకు వెళ్తారు. లేకపోతే రహస్యంగా గర్భవిచ్ఛిత్తికి పాల్పడతారు. దీనివల్ల వారిని మరింత ప్రమాదంలోకి నెట్టినట్లవుతుంది. తాజా కేసులో బాలిక వయసు 15 సంవత్సరాలు. అది ఆమెకు అవాంఛిత గర్భం. ఈ గర్భం కొనసాగించడం ఇష్టంలేక ఆమె రెండుసార్లు ప్రాణాలు తీసుకోవడానికి ప్రయత్నించింది. ఇలాంటి సమయంలో దానిని కొనసాగించమని చెప్పడం ఆమెకు మంచి చేయదు'' అని ధర్మాసనం అభిప్రాయపడింది.



వీకెండ్ టూర్

# తెలంగాణ అరకు లోయ!

నేచర్ అంటే అందరికీ ఇష్టమే. కానీ, దాన్ని ఎంజాయ్ చేయాలంటే మాత్రం తీరిక ఉండదు చాలామందికి. అందుకే కొందరు టూర్‌కి వెళ్లాలంటే ముందుగానే ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. అయితే, దూరప్రాంతాలకు వెళ్లాలంటేనే ముందస్తు ప్లానింగ్ అవసరం. వీకెండ్స్‌లో టూర్ వెళ్లేవాళ్లకు అంత ముందస్తు ప్లానింగ్ అక్కర్లేదు. చూడదగ్గ ప్రదేశం దగ్గర్లో ఎక్కడ ఉందో తెలుసుకుంటే చాలు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీకి దగ్గర్లోనే ఓ అందమైన ప్రదేశం ఉంది. అదే v. మరి దాని ప్రత్యేకతలేంటో తెలుసుకుందాం.



అనంతగిరి హిల్స్.... హైదరాబాద్ సిటీకి చాలా దగ్గర్లో ఉండే ప్రదేశాల్లో ఇదొకటి. వికారాబాద్ జిల్లాలో అనంతగిరి హిల్స్ ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని తెలంగాణ అరకులోయ అని చెప్పొచ్చు. ఇక్కడి పచ్చదనం, లోయలు, జలపాతాలు కనువిందు చేస్తాయి. గత కొంతకాలంగా ఇక్కడ మౌలిక వసతులతో పాటు వచ్చే టూరిస్టుల సంఖ్య కూడా పెరుగుతోంది. అందుకే సెలవులు, వీకెండ్ రోజుల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఇంకా ఎక్కువ ఉంటుంది. దీంతో తెలంగాణ టూరిజం 'హైదరాబాద్ నుంచి అనంతగిరి (వికారాబాద్) & బ్యాక్ వన్ డే టూర్ ప్యాకేజీ' పేరుతో ఈ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. ప్రతి శని, ఆదివారాల్లో ఈ ట్రిప్ అందుబాటులో ఉంటుంది. కేవలం ఈ ట్రిప్‌కు వెళ్తే చాలు ఒక్క రోజులో అనంతగిరి హిల్స్ చూసిరావొచ్చు.

**టూర్ షెడ్యూల్ :** ఈ ప్యాకేజీని హైదరాబాద్ సిటీ నుంచి ఆపరేట్ చేస్తుంది.

ప్రతి వీకెండ్ లోని శని, ఆదివారం తేదీల్లో ఈ టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉంటుంది.

కేవలం ఒక్క రోజులోనే ట్రిప్ ముగుస్తుంది.

- టికెట్ ధరలు ఎలా ఉన్నాయంటే.. పెద్దలకు రూ. 1800, పిల్లలకు రూ. 1440గా ఉంది.

నాన్ ఏసీ బస్సులో వెళ్లాల్సి ఉంటుంది.

- ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ లోని యాత్రి నివాస్ నుంచి బస్సు బయల్దేరుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు అనంతగిరి చేరుకుంటారు.
- సికింద్రాబాద్‌లోని యాత్రి నివాస్ వద్ద బస్సు ఎక్కాలి.
- ఉదయం 9 గంటలకు బస్సు స్టార్ట్ అవుతుంది.
- మధ్యాహ్నం 12 గంటలకు అనంతగిరి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు మొదట అనంత పద్మనాభ స్వామి ఆలయ దర్శనం ఉంటుంది.
- అడవిలోకి వెళ్లి చూడాలనుకునే వారు మధ్యాహ్నం 12.30 నుంచి 01.30 గంటల వరకు చూడొచ్చు.
- మధ్యాహ్నం 01.30 నుంచి 02.30 వరకు హరిత హోటల్‌లో భోజనం(వెజ్) ఉంటుంది.
- 02.30 నుంచి 04.30 వరకు గేమ్స్ ఆడుకోవచ్చు.
- 04.30 నుంచి 5 గంటల మధ్యలో హరిత హోటల్‌లో టీ, స్నాక్స్ అందిస్తారు.
- తర్వాత సాయంత్రం 5 గంటలకు అనంతగిరి నుంచి హైదరాబాద్‌కు బస్సు బయలుదేరుతుంది.
- రాత్రి 8 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోవడంతో ట్రిప్ ముగుస్తుంది.

టూర్ ప్యాకేజీ లేదా మరిన్ని వివరాల కోసం https://tourism.telangana.gov.in/ వెబ్ సైట్‌లో తెలుసుకోవచ్చు.






## సిద్ధాంతాల బలిపీఠంపై అధికార కాంక్ష!

# సామాన్యుడి ఓటుకు విలువేది?

- **ఢిల్లీ పీఠంపై పంజా విసిరిన బీజేపీ: రాజ్యసభ సాక్షిగా ప్రతిపక్షం నిర్వీర్యం!**
- **(ప్రత్యామ్నాయ రాజకీయాల పతనం.. చీపురు పట్టిన చేతులే.. పార్టీకి తూట్లు పొడిచాయా?రాజ్యసభలో 'రాజకీయ ఆపరేషన్'..రాజ్యాంగ లొసుగులతో ప్రజాస్వామ్య ఖూనీ!)**



వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ 9848559863

భారత రాజకీయ యవనికపై 'ప్రత్యామ్నాయ రాజకీయాలు' అనే నినాదంతో, అవినీతికి వ్యతిరేకంగా సామాన్యుడి గొంతుకగా ఆవిర్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేడు నిలువునా చీలిపోవడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విషాదకర అధ్యాయం. 2026 ఏప్రిల్ 24న వెలువడిన వార్తలు దేశవ్యాప్త రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. పార్టీలో అత్యంత కీలక నేత, యువ గొంతుకగా పేరున్న ఎంపీ రాఘవ్ చద్దా తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరడం ఒక ఎత్తయితే, సిద్ధాంతాల బలిపీఠంపై అధికార కాంక్ష! సామాన్యుడి ఓటుకు విలువేది? అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఓటరు మదిలో మెదులుతోంది. "నేను ఇంతకాలం రాంగ్ పార్టీలో ఉన్నాను" అని రాఘవ్ చద్దా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశాయి. ఒక సిద్ధాంతాన్ని నమ్మి, వీధి పోరాటాల ద్వారా పుట్టిన పార్టీలో దశాబ్ద కాలం పాటు వెన్నంటి ఉండి, ఇప్పుడు అది 'తప్పుడు పార్టీ' అని ప్రకటించడం వెనుక దాగిన అధికార కాంక్షను విశ్లేషించాల్సిన అవసరం ఉంది. సామాన్యుడి ఓటు కేవలం అధికారం మార్చడానికేనా లేక ఆ ఓటు వెనుక ఉన్న ఆశయాలను కూడా నాయకులు ఇలాగే స్వార్థ ప్రయోజనాల కోసం బలిపీఠం ఎక్కిస్తారా అన్నది ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన అంశం. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక నమ్మకం, కానీ నేటి రాజకీయాల్లో ఆ నమ్మకం కేవలం ఎన్నికల వరకు మాత్రమే పరిమితమవుతోంది. గెలిచిన తర్వాత సిద్ధాంతాలను గాలికి వదిలేసి, అవకాశవాద రాజకీయాలకు తెరలేపడం వల్ల సామాన్య ఓటరు తనను తాను వంచించుకున్నట్లు భావిస్తున్నాడు. ఈ తరహా ఫిరాయింపులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, ఒక రాజకీయ వ్యవస్థపై ప్రజలకున్న కనీస విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలు. ఈ మొత్తం పరిణామం వెనుక కేంద్ర అధికార పార్టీ పక్కాగా అమలు చేసిన 'రాజకీయ ఆపరేషన్' స్పష్టంగా కనిపిస్తోంది. ఢిల్లీ మరియు పంజాబ్ రాష్ట్రాల్లో బలమైన ఉనికి కలిగి, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించిన ఆప్ను లోపలి నుండే దెబ్బతీయడం ద్వారా ప్రతిపక్ష గొంతును నిర్వీర్యం చేయడం ఇక్కడ ప్రధాన ఎత్తుగడ. ఢిల్లీ పీఠంపై పంజా విసిరిన బీజేపీ: రాజ్యసభ సాక్షిగా ప్రతిపక్షం నిర్వీర్యం! అనే విమర్శలకు తాజా సంఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి. రాజ్యసభలో మెజారిటీ సాధించడం అనేది ఏ కేంద్ర ప్రభుత్వానికైనా ఒక వ్యూహాత్మక లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి బీజేపీ, ఆప్ లోని అంతర్గత సెగను ఆసరాగా చేసుకుంది. రాజ్యసభలో ఆప్కు ఉన్న పది మంది సభ్యులలో ఇప్పటికే ముగ్గురు——రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్——రాజీనామా చేసి బీజేపీ గూటికి చేరారు. త్వరలోనే మరో నలుగురు కూడా గుడ్ బై చెబుతారని రాఘవ్ చద్దా స్వయంగా ప్రకటించడం గమనిస్తే, ఇది కేవలం విడిపోవడం కాదు, ఒక జాతీయ పార్టీని వ్యవస్థీకృతంగా మింగేయడమే. రాజ్యసభ సాక్షిగా ప్రతిపక్ష బలాన్ని తగ్గించి, ప్రభుత్వ నిర్ణయాలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా బాటలు వేసుకోవడం ప్రజాస్వామ్య సమతుల్యతకు గొడ్డలిపెట్టు. ఒక బలమైన ప్రతిపక్షం లేని పార్లమెంట్, ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడంతో సమానం. ప్రాంతీయ పార్టీల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ, ఏకపక్ష ఆధిపత్యం వైపు దేశం వెళ్తోందనే ఆందోళన ఈ పరిణామాల ద్వారా వ్యక్తమవుతోంది. ఇది కేవలం ఆప్ సమస్య మాత్రమే కాదు, భారత సమాఖ్య వ్యవస్థలో ప్రతిపక్షాల ఉనికి ఎంతవరకు సురక్షితం అనే తర్కాన్ని తెరపైకి తెస్తోంది. అవినీతి రహిత రాజకీయాల కోసం 'చీపురు' పట్టిన ఆప్ నాయకులు, నేడు అదే చీపురుతో పార్టీ పునాదులనే ఊడ్చేయడం విచారకరం. ప్రత్యామ్నాయ రాజకీయాల పతనం.. చీపురు పట్టిన చేతులే.. పార్టీకి తూట్లు పొడిచాయా? అన్నట్లుగా నేటి పరిస్థితులు మారాయి. రాఘవ్ చద్దా వ్యాఖ్యలు పార్టీలోని నియంతృత్వ ధోరణులను ఎత్తిచూపుతున్నాయి. ఈ నెల 2వ తేదీన రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి చద్దాను తప్పించి, అశోక్ మిట్టల్కు బాధ్యతలు అప్పగించడం ఆ పార్టీలో ముదిరిన కుమ్ములాటలకు నిదర్శనం. అయితే, పదవుల మార్పు అనేది పార్టీ అంతర్గత విషయం కావచ్చు, కానీ దానిని సాకుగా చూపి ఏకంగా పార్టీని వీడటం వెనుక ఉన్న నైతికతను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "నేను ఆప్ వ్యవస్థాపక సభ్యుడిని, అలాంటిది నా గొంతు నొక్కారు" అని చద్దా ఆవేదన వ్యక్తం చేయడం వెనుక పార్టీ నాయకత్వ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వ్యవస్థాపక సభ్యులుగా ఉండి పార్టీని ప్రక్షాళన చేయాల్సింది పోయి, ప్రత్యర్థి పార్టీలో చేరడం అంటే చీపురు పట్టిన చేతులే పార్టీకి తూట్లు పొడిచినట్లు అవుతోంది. రాజకీయాల్లో విలువల కంటే వ్యక్తిగత హోదాకే ప్రాధాన్యత పెరిగిందని, ప్రత్యామ్నాయ రాజకీయాల భావన కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితమైందని ఈ పతనం నిరూపిస్తోంది. ఒక గొప్ప ఆశయంతో మొదలైన ప్రయాణం ఇలా అవకాశవాద మలుపులు తిరగడం రాజకీయ విశ్లేషకులను కలచివేస్తోంది. అధికార పీఠం కోసం ఇచ్చే హామీలు, చేసే పోరాటాలు చివరికి స్వంత ప్రయోజనాల దగ్గర ఆగిపోవడం సామాన్య కార్యకర్తలను నిరాశకు గురిచేస్తోంది.చివరిగా, ఈ విలీన పర్వం రాజ్యాంగం కల్పించిన లొసుగులను ఎలా వ్యూహాత్మకంగా వాడుకోవచ్చో ప్రపంచానికి చాటిచెబుతోంది. రాజ్యసభలో 'రాజకీయ ఆపరేషన్'.. రాజ్యాంగ లొసుగులతో ప్రజాస్వామ్య ఖూనీ! అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఫిరాయింపు నిరోధక చట్టం (10వ షెడ్యూల్) ప్రకారం, ఒక పార్టీ సభ్యులు అనర్హతకు గురికాకుండా ఉండాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ సభ్యులు విడిపోయి మరో పార్టీలో విలీనం కావాలి. ఆప్ లోని పది మంది ఎంపీల్లో ఏడుగురు బయటకు రావడం అంటే, అది సాంకేతికంగా చట్టబద్ధమైన 'విలీనం' కిందికే వస్తుంది. ఈ సాంకేతికతను ఆసరాగా చేసుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఖూనీ చేస్తున్నారు. చట్టం ప్రకారం ఇది సరైనదే కావచ్చు, కానీ ప్రజలు ఒక గుర్తుపై గెలిపించిన ప్రతినిధులు మరో గుర్తు కిందకి మారిపోవడం అంటే అది ఓటరును వంచించడమే. రాజ్యసభ వంటి ఎగువ సభలో రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాల్సిన సభ్యులు, కేవలం పార్టీ ఫిరాయింపుల ద్వారా అధికార బలాన్ని పెంచే పావులుగా మారడం దేశ భవిష్యత్తుకు శుభసూచకం కాదు. ఇక్కడ ఫిరాయింపు నిరోధక చట్టం తన ప్రాథమిక ఉద్దేశ్యాన్ని కోల్పోయి, సామూహిక ఫిరాయింపులకు ఒక సులభమైన మార్గంగా మారుతోంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత విలువల పతనానికి నిదర్శనం. ముగింపుగా చూస్తే, ఆమ్ ఆద్మీ పార్టీలో చోటుచేసుకున్న ఈ భారీ చీలిక భారత రాజకీయాల్లో తీవ్రమైన నైతిక సంక్షోభాన్ని సూచిస్తోంది. రాఘవ్ చద్దా వంటి యువ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తు కోసం చేస్తున్న ఈ మార్పులు, సామాన్య ప్రజలలో రాజకీయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. సిద్ధాంతాలనే తుంగలో తొక్కి చేసే విలీనాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. ఢిల్లీ పీఠంపై పంజా విసిరిన బీజేపీ ఎత్తుగడలు ఫలించి ఉండవచ్చు, కానీ ప్రజాస్వామ్య మూలాల్లో ఈ పరిణామాలు మిగిల్చిన గాయాలు అంత సులభంగా మానవు. రాజకీయ పార్టీలు తమ నాయకత్వాన్ని మరియు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోకపోతే, ఇలాంటి విచ్ఛిన్నాలు అనివార్యమవుతాయి. ఇకనైనా ఓటరు తన ఓటు విలువను గుర్తించి, ఇలాంటి అవకాశవాద రాజకీయాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. లేదంటే, ప్రజాస్వామ్యం కేవలం అంకెల ఆటగానే మిగిలిపోతుంది తప్ప, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉండదు. సిద్ధాంతాలు లేని అధికారం, బాధ్యత లేని నాయకత్వం దేశ భవిష్యత్తుకు ఎప్పుడూ ప్రమాదకరమే. నైతికత లేని రాజకీయం సమాజానికి చేటు తెస్తుందని ఈ పరిణామాలు మరోసారి నిరూపించాయి. ఈ రాజకీయ చదరంగంలో చివరకు ఓడిపోయేది సామాన్య పౌరుడే అన్నది చేదు నిజం.

## 982 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్..

ఒక్కరోజే రూ.4 లక్షల కోట్లు నష్టం

అంతర్జాతీయ ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు

స్టాక్ మార్కెట్లు భారీగా పతనం

సెన్సెక్స్ 983 పాయింట్లు నష్టపోగా, 24,000 మార్కు దిగువకు నిఫ్టీ

బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 107 డాలర్లను దాటిన వైనం

దెబ్బతిన్న ఇన్వెస్టర్ల సెంటిమెంట్

ఐటీ రంగ షేర్లకు అత్యధికంగా నష్టం





**ముంబై:** భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 983 పాయింట్లు, నిఫ్టీ 275 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,483.80 పాయింట్ల వద్ద నష్టంతోనే ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ మొత్తం నష్టాల్లోనే కొనసాగింది. ఏ దశలోనూ పుంజుకోలేదు. ఇంట్రాడేలో 76,403.87 వద్ద కనిష్ట స్థాయికి చేరింది. చివరకు 982.71 పాయింట్ల (1.27%) నష్టంతో 76,681.29 పాయింట్ల వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 275.10 పాయింట్ల (1.14%) నష్టంతో 23,879.95 వద్ద ముగిసింది. బీఎస్ఈకి సంబంధించి ఒక్క రోజులోనే లిస్టెడ్ కంపెనీల విలువ భారీగా తగ్గింది. రూ.4 లక్షల కోట్లు నష్టపోయి రూ.461 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా సంస్థలు నష్టాలు చవిచూశాయి. ఇందులో ఇన్ఫోసిస్ షేర్లు 7 శాతం పడిపోయాయి. ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 107.12 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4681 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.25గా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇంకా తగ్గకపోవడం, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్ నష్టాలకు కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

## ఒకే నెలలో 46 వేల ఉద్యోగాలు కట్..

సిద్ధమవుతున్న మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్



**న్యూఢిల్లీ:** ఐటీ అనుబంధ సంస్థల్లో భారీ స్థాయిలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. ఏఐ కారణంగా ఆయా సంస్థల్లో వేలాది మందిని ఉద్యోగంలోంచి తొలగిస్తున్నారు. త్వరలో టాప్ కంపెనీల్లో కూడా భారీగా కోతలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కలిసి వచ్చే జూన్‌లో భారీగా ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈ మూడు సంస్థలు కలిసి జూన్‌లో ఏకంగా 46,750 మంది సిబ్బందిని తొలగించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత మార్చిలో కూడా అనేక సంస్థలు ఉద్యోగుల్ని తొలగించాయి.

ఏఐ టెక్నాలజీ మీద పెట్టుబడులకు సిద్ధమవ్వడం, కంపెనీలో నిర్మాణాత్మక మార్పుల కారణంగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. ఒకవైపు తమ కంపెనీలు వృద్ధి బాటలోనే నడుస్తున్నాయని చెబుతూనే, భవిష్యత్తు బాగుంటుందని చెబుతూనే ఉద్యోగుల్ని తొలగిస్తుండటం విశేషం. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కూడా ఇప్పుడు ఇంకో 46,750 మందిని తొలగించబోతుండటం ఆసక్తికరంగా మారింది. మెటా సంస్థ తన కంపెనీలో పని చేస్తున్న వారిలో పది శాతం మంది ఉద్యోగుల్ని.. అంటే కనీసం 8,000 మందిని తొలగించాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా కొంతమందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలి అని ఇంతకుముందు తీసుకున్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇదే సమయంలో ఏఐ టెక్నాలజీపై మెటా భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ఏడాది 135 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయాలని కంపెనీ నిర్ణయించింది. అంటే, గత మూడేళ్లలో కంపెనీ ఏఐ మీద పెట్టుబడి పెట్టిన దానితో సమానం.

ఏఐ టెక్నాలజీ సిబ్బంది అవసరాన్ని తగ్గిస్తుందని గతంలోనే మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఒరాకిల్ సంస్థ కూడా 30,000 మందిని తొలగించబోతుంది. ఇప్పటికే కొందరికి దీనికి సంబంధించిన మెయిల్స్ వచ్చినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. మెయిల్ వచ్చినప్పటి నుంచే ఉద్యోగంలోంచి తొలగిస్తారు. మరోవైపు మైక్రోసాఫ్ట్ సంస్థ 8,750 మంది సిబ్బందిని తొలగించాలని నిర్ణయించింది. అంటే సంస్థలో 7 శాతం సిబ్బందిని తొలగించబోతుంది. అయితే, సిబ్బందికి వాలంటరీ రిటైర్‌మెంట్ అవకాశం కల్పిస్తోంది. మైక్రోసాఫ్ట్ స్థాపించిన 51 ఏళ్లలో ఇలాంటి ప్రతిపాదన తీసుకురావడం ఇదే మొదటిసారి.

## మారుతి సుజుకి సరికొత్త రికార్డు...

ప్రతి 14 నిమిషాలకు ఒక కారు!

2025-26 ఆర్థిక సంవత్సరంలో 23.4 లక్షల కార్లు ఉత్పత్తి చేసిన మారుతి

ప్రతి 14 నిమిషాలకు ఒక కారు తయారు చేసి కొత్త రికార్డు

భారత్‌లో ఏ ఆటోమొబైల్ కంపెనీ సాధించని అత్యధిక ఉత్పత్తి ఇది

ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు పెంచడమే లక్ష్యమన్న ఎండీ



**న్యూఢిల్లీ:** భారత ఆటోమొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ సరికొత్త సంచలనం సృష్టించింది. సగటున ప్రతి 14 నిమిషాలకు ఒక కారును ఉత్పత్తి చేస్తూ అసాధారణ రికార్డును నెలకొల్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఏకంగా 23.4 లక్షల కార్లను తయారు చేసింది. ఇది మారుతి సుజుకి చరిత్రలోనే కాకుండా, భారతదేశంలో ఏ ఒక్క ఆటోమొబైల్ తయారీ కంపెనీ కూడా ఇప్పటివరకు నమోదు చేయని అత్యధిక వార్షిక ఉత్పత్తి.

ఈ ఆర్థిక సంవత్సరంలో డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మోడల్స్ అత్యధికంగా ఉత్పత్తి అయ్యాయి. ఈ ఐదు మోడళ్లలో ప్రతి ఒక్కటీ 2 లక్షలకు పైగా యూనిట్లుగా తయారయ్యాయి. సుజుకి మోటార్ కార్పొరేషన్‌కు చెందిన ప్రపంచవ్యాప్త తయారీ కేంద్రాలలో కూడా ఈ స్థాయి ఉత్పత్తిని సాధించిన ఏకైక కంపెనీగా మారుతి సుజుకి నిలిచింది.

ఈ అపూర్వ విజయంపై మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి తకేయుచి స్పందించారు. "ఒకే దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో వాహనాలు తయారు చేయడం గర్వకారణం. నాలుగున్నర దశాబ్దాలుగా మేం నిర్మించిన ఆటోమొబైల్ పర్యావరణ వ్యవస్థ, మా ఉద్యోగులు, భాగస్వాముల సమష్టి కృషి, ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ 2.0 వంటి విధానాల వల్లే ఇది సాధ్యమైంది" అని ఆయన వివరించారు.

భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 40 లక్షల యూనిట్లకు పెంచాలని, భారతదేశాన్ని కీలకమైన ఎగుమతి హబ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తకేయుచి తెలిపారు. ఈ విజయం మారుతి సుజుకి పటిష్ఠమైన సరఫరా వ్యవస్థ, డీలర్ నెట్‌వర్క్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.

# కోహ్లీ క్లాస్.. పడిక్కల్ మాస్..

గుజరాత్‌ను చిత్తు చేసిన ఆర్సీబీ

గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో బెంగళూరు ఘన విజయం


206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన రాయల్ ఛాలెంజర్స్

అర్ధ సెంచరీలతో చెలరేగిన విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్

సాయి సుదర్శన్ అద్భుత సెంచరీ వృథా

**బెంగళూరు:** ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సొంతగడ్డపై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. గుజరాత్ నిర్దేశించిన 206 పరుగుల భారీ లక్ష్యాన్ని విరాట్ కోహ్లీ (81), దేవదత్ పడిక్కల్ (55) అద్భుత ఇన్నింగ్స్‌లతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.





భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్‌తో కలిసి కోహ్లీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు కేవలం 59 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. ముఖ్యంగా పడిక్కల్ కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో విరుచుకుపడగా, కోహ్లీ 44 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవ్వడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఈ దశలో కృనాల్ పాండ్యా (23నాటౌట్), టిమ్ డేవిడ్ (10నాటౌట్) సంయమనంతో ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్, ఓపెనర్ సాయి సుదర్శన్ (58 బంతుల్లో 100) అద్భుత సెంచరీతో 20 ఓవర్లలో 3 వికెట్లకు 205 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (32) కూడా రాణించాడు. అయినప్పటికీ, కోహ్లీ, పడిక్కల్ మెరుపుల ముందు సుదర్శన్ శతకం వృథా అయింది.



## నా ఆఖరి మిషన్ అదే.. త్వరలోనే క్రికెట్‌ను వదిలేస్తా..!




**న్యూజిలాండ్:** న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు దశాబ్దాలకు పైగా వైట్ ఫెర్న్స్ జట్టు విజయాల్లో కీలకమవుతున్న ఈ సీనియర్ ఆల్‌రౌండర్ త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనుంది. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ విజేతగా క్రికెట్‌కు అల్విదా చెబుతానని వెల్లడించిందీ సీనియర్ ప్లేయర్. బ్రిటన్‌లో జరుగబోయే పొట్టి ప్రపంచకప్ నాకు ఆఖరు. ఈ టోర్నీలో ఛాంపియన్‌గా ఆటకు రిటైర్మెంట్ చెప్పేస్తాను అని బేట్స్ తెలిపింది.

మహిళా క్రికెట్‌లో సీనియర్ ప్లేయర్ సుజీ బేట్స్ అంతర్జాతీయ క్రికెట్‌ను వీడేందుకు సిద్ధమైంది. వచ్చే పొట్టి ప్రపంచకప్ ఆడేసి ఆటకు గుడ్ బై చెప్పాలని బేట్స్ నిర్ణయించుకుంది. 'ఇరవై ఏళ్ల కెరీర్‌ను చూసుకుంటే.. కాలం ఎంత త్వరగా పరుగులు తీసిందో నమ్మలేకపోతున్నా. వైట్ ఫెర్న్స్ తరపున ఎన్నో విజయాలు సాధించడం చాలా గర్వంగా ఉంది. ప్రతిరోజు గొప్ప వ్యక్తిగా, జట్టు సభ్యురాలిగా, అథ్లెట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తాను అని బేట్స్ వెల్లడించింది. నా ఆఖరి మిషన్ ఒకటుంది.

నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చిన బ్రిటన్‌కు వెళ్లి.. అక్కడ మరొక వరల్డ్‌కప్ గెలవాలని అనుకుంటున్నా. చివరిసారిగా జట్టు కోసం నా సర్వశక్తులు ఒడ్డుతాను. నాకు మద్దతుగా నిలిచిన కుటుంబసభ్యులు, స్నేహితులు అందరికీ కృతజ్ఞతలు. ఈ ప్రయాణంలో ఎదురైన ఒడిదొడుకుల్లో తోడుగా ఉన్న నా భర్త స్కాటీ, నా కుమారులకు కృతజ్ఞతలు. నాకు ఇన్ని అవకాశాలు కల్పించిన కోచ్‌లకు ధన్యవాదాలు' అని బేట్స్ పేర్కొంది.

2006లో అంతర్జాతీయ మ్యాచ్

దేశవాళీ క్రికెట్‌లో పదిహేనేళ్లకు అరంగేట్రం చేసిన బేట్స్ 2006లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. మహిళల టీ20ల్లో అత్యధిక పరుగుల రికార్డు నెలకొల్పిన ఈ సీనియర్ ఆల్‌రౌండర్ వన్డేల్లో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. 2011లో కివీస్ సారథిగా ఎంపికైన బేట్స్ ఏడేళ్లు జట్టును గొప్పగా నడిపింది. క్రికెటర్‌గా, కెప్టెన్‌గా

## 'కంకషన్ సబ్‌స్టిట్యూట్' దుర్వినియోగం..

**ముంబై:** పంతొమ్మిదో సీజన్‌లో నిరాశపరుస్తున్న ముంబై ఇండియన్స్ మరో వివాదంలో చిక్కుకుంది. వాంఖడేలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ముంబై కంకషన్ సబ్‌స్టిట్యూట్ నిబంధనను దుర్వినియోగం చేసిందని పలువురు మండిపడుతున్నారు. గాయపడిన మిచెల్ శాంట్నర్ స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను ఆడించడాన్ని నెటిజన్లు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ముంబై ప్రధాన కోచ్ జయవర్ధనే మాత్రం అదేమీ లేదని కొట్టి పారేశాడు.

ఐపీఎల్ నియమావళి ప్రకారం క్రికెటర్ తలకు లేదా మెడకు గాయమైనప్పుడు మాత్రమే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌ను అనుమతిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్ మాత్రం భుజం గాయంతో బాధ పడిన మిచెల్ శాంట్నర్ స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను ఆడించి విమర్శలకు తావిచ్చింది. కంకషన్ సబ్‌స్టిట్యూట్ నియమాన్ని ముంబై దుర్వినియోగం చేయడంతో ఇదేం క్రీడా స్ఫూర్తి అని మండిపడుతున్నారు. దాంతో.. హెడ్‌కోచ్ మహేళ జయవర్ధనే మాట్లాడుతూ శార్దూల్‌ను పంపడంపై వివరణ ఇచ్చాడు.

'క్యాచ్ అందుకుంటుండగా శాంట్నర్ తల, మెడ నేలకు తాకాయి. భుజం కూడా గట్టిగా తగిలింది. వెంటనే అతడికి స్కాన్ పరీక్షలు



నిర్వహించాం. అయితే.. అతడు మగతగా ఉన్నాడు. భుజం మీద ఐస్ ప్యాక్ ఉంచాం. అయినా శాంట్నర్ నిలకడగా లేడు. అందుకని కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు అనుమతించాలని కోరాం. మ్యాచ్ రిఫరీ, అంపైర్లు శార్దూల్‌ను సబ్‌స్టిట్యూట్‌గా ఆడించేందుకు అంగీకరించారు' అని జయవర్ధనే తెలిపాడు. కంకషన్ సబ్‌గా బ్యాటింగ్‌కు వచ్చిన శార్దూల్ 6 పరుగులకే ఔటయ్యాడు. చివరి వికెట్ తీయడంతో ముంబై 104కే ఆలౌటయ్యింది. ఏకపక్ష పోరులో ఘన విజయం సాధించిన చెన్నై ఆరు పాయింట్లతో ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది.

# పొట్టి క్రికెట్‌లో పోటుగాడు..

ఐపీఎల్‌లో శతకాలతో రెచ్చిపోతున్న శాంసన్..!

**న్యూఢిల్లీ:** పొట్టి క్రికెట్ అంటే చాలు పూనకాలు వచ్చినట్టు ఆడే సంజూ శాంసన్ ఐపీఎల్‌లో చెలరేగిపోతున్నాడు. ప్రపంచకప్ హీరోగా పంతొమ్మిదో సీజన్‌లో అడుగుపెట్టిన సంజూ తన మార్క్ విధ్వంసంతో బౌలర్ల భరతం పడుతున్నాడు. తొలిసారి చెన్నై సూపర్ కింగ్స్ జెర్సీతో ఆడుతున్న సంజూ.. ఆరంభంలో నిరాశపరిచినా ఇప్పుడు శతకాలతో జట్టును గెలిపిస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీతో సీఎస్కేను గెలుపు తోవ తొక్కించిన ఈ హిట్టర్.. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌పైనా వందతో గర్జించాడు. టాపార్డర్, కెప్టెన్ సహా మిడిలార్డర్ మొత్తం విఫలమైనా ఒంటరి సైనికుడిలా చివరిదాకి నిలిచి.. ఎల్ క్లాసిక్‌లో చెన్నై ఏకపక్ష విజయంలో కీలక పాత్ర పోషించాడీ చిచ్చరపిడుగు.

ప్రతిభ ఉన్నా అవకాశాలు అందిపుచ్చుకోలేని క్రికెటర్‌గా ముద్ర పడిన సంజూ శాంసన్ విధ్వంసక ఆటతో వైరలవుతున్నాడు. పొట్టి క్రికెట్‌లో తనను మించిన పోటుగాడు లేడని నిరూపిస్తూ పంతొమ్మిదో సీజన్‌లో రెండో సెంచరీ బాదేశాడు సంజూ. ఒకప్పటిలా తొలి బంతి నుంచి బాదేయడం పక్కనపెట్టి.. పరిస్థితులకు తగ్గట్టు ఆడుతూ చెన్నై గెలుపు పతాకలా అవతరించాడు. ఐపీఎల్‌లో సంజూకు ఇది ఐదో సెంచరీకాగా.. ఒకే సీజన్‌లో సీఎస్కే బ్యాటర్‌గా రెండో శతకం. అతడి కంటే ముందు షేన్ వాట్సన్ 2018 ఎడిషన్‌లో రెండుసార్లు వంద కొట్టాడు.




ఐదు శతకాలు..

ఐపీఎల్‌లో శాంసన్ తొలి శతకం రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్‌పై బాదాడు. 63 బంతుల్లోనే 102 పరుగులతో అదరహో అనిపించాడు. 2019లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 55 బంతుల్లోనే 102 రన్స్ కొట్టిన సంజూ రాజస్థాన్ రాయల్స్ తరఫున తొలి సెంచరీ నమోదు చేశాడు. ఆపై.. పంజాబ్ కింగ్స్‌పైన 2021లో 63 బంతుల్లోనే 119.. పంతొమ్మిదో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 52 బంతుల్లో, ముంబైపై 54 బంతుల్లో సెంచరీతో రికార్డు నెలకొల్పాడు శాంసన్.

ఐపీఎల్ మొదలైందంటే శాంసన్ మెరుపులు గుర్తుకొస్తాయి. కండబలంతో బంతిని అమాంతం స్టాండ్స్‌లోకి పంపే సంజూ గత సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున దంచేశాడు. ఇప్పుడు అతడు చెన్నై సూపర్ కింగ్స్ ట్రంప్ కార్డులా మారాడు. పసుపు జెర్సీతో తొలి మూడు మ్యాచుల్లో రెండంకెల స్కోర్ కూడా చేయడి శాంసన్ ఫామ్ అందుకున్నాక కసిదీరా కొడుతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీతో తన తడాఖా చూపిన ఈ డాషింగ్ బ్యాటర్.. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌పైనా శతకంతో సీఎస్కేను గెలిపించాడు.

ఎంఎస్ ధోనీ గైర్హాజరీలో.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ విఫలమవుతున్న వేళ నేనున్నానంటూ చెన్నై మ్యాచ్ విన్నర్‌గా అవతరించిన శాంసన్‌కు కెప్టెన్సీ కట్టబెట్టడమే బాకీ ఉందని క్రీడా పండితులు, అభిమానులు చర్చించుకుంటున్నారు. ఐపీఎల్-19లో ఏడు ఇన్నింగ్స్‌ల్లో 178.66 స్ట్రయిక్ రేటుతో 293 రన్స్ బాదేసిన సంజూ సీఎస్కేను ప్లే ఆఫ్స్ రేసులో నిలిపాడు.

MOVIE TIME

## క్రైమ్ థ్రిల్లర్ కథ...
# పరమపదసోపానం




**టాకీస్:** అర్జున్ అంబటి, జెనిఫర్ ఇమాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'పరమపద సోపానం'. స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు నాగ శివ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన ఈ యాక్షన్ రివెంజ్ డ్రామా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా ఏ మేరకు ఆకట్టుకుందో విశ్లేషణలోకి వెళ్లి తెలుసుకుందాం. హెల్త్ కమిషనర్ సత్యప్రకాష్ (కోటేశ్వరరావు) దారుణ హత్యతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. ఈ హైప్రొఫైల్ కేసును ఛేదించే బాధ్యతను అశ్వద్ధామ (అజయ్ రత్నం) స్వీకరిస్తాడు. అయితే ఈ కేసులో ప్రధాన సాక్షిగా అర్జున్ (అర్జున్ అంబటి) అనే గేమింగ్ డిజైనర్‌ను గుర్తిస్తారు. అయితే, అర్జున్ ఓ మానసిక సమస్యతో బాధపడుతుంటాడు. తనను ఎవరో చంపాలని ప్రయత్నిస్తున్నారనే భయంలో ఉన్న అర్జున్‌కు రక్షణగా క్రైమ్ బ్రాంచ్ సీఐ నేహా (జెనిఫర్ ఇమాన్యుయేల్) బృందాన్ని నియమిస్తారు. మరోవైపు వరుసగా ప్రభుత్వ అధికారులు హత్యకు గురవుతుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? హెల్త్ మినిస్టర్ పురుషోత్తం రెడ్డి (పిల్లా ప్రసాద్) పాత్ర ఏమిటి? అసలు 'పాలకడలి' అనే గ్రామానికి, ఈ కథకు ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. దర్శకుడు నాగ శివ తన తొలి ప్రయత్నంలోనే ఒక బలమైన సామాజికాంశాన్ని కమర్షియల్ హంగులతో జోడించి తెరకెక్కించడంలో విజయం సాధించారు. మొదటి భాగం వరుస హత్యలు, సస్పెన్స్ అంశాలతో పాటు మెహబూబ్ బాషా కామెడీతో సరదాగా సాగిపోతుంది. ఇక ఇంటర్వెల్ ట్విస్ట్ సెకండాఫ్ పై ఆసక్తిని పెంచుతుంది.

# సితార పిక్చర్స్‌లో నితిన్



**టాకీస్:** యంగ్ హీరో నితిన్ వరుస ఫ్లాపులతో బాగా వెనుకబడిపోయాడు. బీష్మ తర్వాత సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న నితిన్ మరొక సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా సోము, నర్రి అనే ఇద్దరు డెబ్యూ డైరెక్టర్లు టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ కొత్త చిత్రం మే 4వ తేదీన లాంఛనంగా ప్రారంభించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మే 6వ తేదీ నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ప్రీ ప్లాన్ షెడ్యూల్ తో కేవలం 55 రోజుల్లోనే ఈ సినిమా పూర్తి షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారు. అంటే దాదాపు రెండు నెలల లోపే షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోతుంది.

## దిల్ రాజ్ నిర్మాతగా
# సల్మాన్ మూవీ
### పూజా కార్యక్రమాలతో ప్రారంభం




**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. షూటింగ్ ప్రారంభంపై స్పందించిన సల్మాన్ ఖాన్, ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌ను వచ్చే ఏడాది ఈద్ పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నిరాశ చెందవద్దు. మీ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది అని అభిమానులకు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఈద్ సందర్భంగా ఆయన సినిమాలు విడుదలై భారీ విజయాలు సాధించడం తెలిసిందే. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగు చిత్రసీమలో విజయవంతమైన సినిమాలతో గుర్తింపు పొందిన వంశీ పైడిపల్లి ఈ సినిమాతో హిందీ చిత్రసీమలో అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో కథ సిద్ధం చేసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో, ప్రేక్షకులను ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలతో సినిమా రూపొందనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో, టాలీవుడ్ హిట్ దర్శకుడు కలయికలో వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. ఈద్ విడుదల లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ సినిమా, సల్మాన్ ఖాన్ కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. కాగా, గత కొన్నాళ్లుగా సల్మాన్ ఖాన్ హిట్స్ అందించలేక నిరాశలో ఉన్నారు. టాలీవుడ్ డైరెక్టర్‌తో చేస్తున్న సినిమాతో అయిన మంచి హిట్ అందుకుంటాడా అనేది చూడాలి.




# చిరంజీవికి విలన్‌గా యంగ్ హీరోయిన్..
## బాబీ సినిమాలో గ్లామరస్ బ్యూటీ..
### బంపర్ ఆఫర్ కొట్టేసిందిగా.. !!

టాకీస్: మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఇటీవలే మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. సంక్రాంతికి విడుదలైన ఈ మూవీకి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. తాజాగా దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి ఒక భారీ ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్ బస్టర్ విజయం సాధించడంతో, ఈ కొత్త సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో టాలీవుడ్ యంగ్ బ్యూటీ డింపల్ హయాతి ఒక కీలకమైన పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అది కూడా సాదాసీదా పాత్ర కాదు, మెగాస్టార్‌ను ఢీకొట్టే పవర్‌ఫుల్ నెగటివ్ రోల్ అని తెలుస్తోంది. సాధారణంగా గ్లామరస్ పాత్రలకు పరిమితమయ్యే డింపుల్, ఈ సినిమాలో విలనిజం పండించబోతుండటం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యింది. తన నటనతో, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాత్రకు ఆమె పూర్తి న్యాయం చేస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. దర్శకుడు బాబీ తన సినిమాల్లో ప్రతినాయక పాత్రలను చాలా పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తుంటారు. చిరంజీవితో చేయబోయే ఈ సినిమాలో కూడా విలన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉందట. ఒక వైపు చిరంజీవి మాస్ మేనరిజమ్స్, మరోవైపు డింపల్ హయాతి నెగటివ్ షేడ్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, డింపల్ కెరీర్‌కు ఇది ఒక పెద్ద మలుపు అవుతుందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చిరంజీవి తన ఇతర ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన వెంటనే ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మెగాస్టార్ వింటేజ్ లుక్‌లో కనిపిస్తారని సమాచారం. మొత్తానికి, బాబీ తన మార్క్ మేకింగ్‌తో చిరంజీవిని మరోసారి వెండితెరపై పవర్‌ఫుల్‌గా చూపించడానికి సిద్ధమవుతుండగా, డింపల్ హయాతి పాత్ర ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది సంక్రాంతికి రవితేజ సరసన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చింది. చాలా కాలంగా తెలుగులో వరుస సినిమాలతో అలసిస్తున్న ఈ బ్యూటీకి ఇప్పటికీ సరైన బ్రేక్ రాలేదు. ఇక ఇప్పుడు చిరంజీవి సినిమాలో ఏకంగా నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనుంది అమ్మడు. ప్రస్తుతం డింపుల్ హయాతి.. హీరో శర్వానంద్ సరసన భోగి అనే చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు.

# మరోమారు వాయిదా దిశగా పెద్ది
### జూన్ 4 నుంచి 24కు మారినట్లు వార్తలు



**టాకీస్:** మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హై-వోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌ని ఫైనల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

# లీగల్ వివాదాల్లో దృశ్యం-3
### ఆలస్యం కానున్న విడుదల

**టాకీస్:** మలయాళ వెండితెరపై సంచలనం సృష్టించిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సిరీస్ సంచలనాలు సృష్టించింది. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడవ భాగం 'దృశ్యం 3' కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చట్టపరమైన చిక్కుల్లో పడటం ఇప్పుడు కేరళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ గతంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు, డిజిటల్ సంస్థకు అనుకూలంగా కీలక తీర్పునిచ్చింది. మే 15వ తేదీ వరకు 'దృశ్యం 3' సినిమాకు సంబంధించి ఎలాంటి కొత్త డీల్స్ క్షి లేదా ఇతర డిజిటల్ హక్కులు కుదుర్చుకోకూడదని నిర్మాతలకు స్టే ఆర్డర్ జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర యూనిట్ డైలమాలో పడింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సమస్య త్వరగా కొలిక్కి రాకపోతే మే 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు మోహన్ లాల్ అభిమానులు మాత్రం ఈ వివాదం త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.